


**అమృతాంజనం** వాడి
**శీఘ్రంగా నివారణ పొందండి**

స్థానికంగా ఉండే బాధను నివారించుకోడానికి ఊరికే మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా కండరాల నొప్పులకు, తలనొప్పికి, బెణుకులకు ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకే కాక సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెంకొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికంతాకలిపి నెలల తరబడి వస్తుంది.

అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిపొందిన నమ్మకమైన గృహఔషధం.

అమృతాంజన్ నొప్పులు జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ




# మనసు సాగరం

## అరవింద

చెట్టు ఎక్కి జామకాయలు కోస్తున్నాడు క్రిష్ణ.

"ఆ పై కొమ్మకి చూడరా. ఎంత పచ్చగా ఉందో. ఆ, కొయ్యి. అది నాకే." అని క్రిందనుంచి కేకలు పెడుతోంది ఇందిర.

"ఇది నాకు. నీ కోసం ఇంకొకటి దాచాలే. అది నీ కిస్తాను ఇందిరక్కా" అన్నాడు క్రిష్ణ.

"ఉహు అదేమీ సాగదు. ఇస్తావా, నన్ను చెట్టెక్కమన్నావా?" అంది చెట్టుమీద కాలువేస్తూ ఇందిర. చెల్లెలు పరిగెత్తుకుని వచ్చింది అక్కడికి.

"అక్కా, అన్నయ్య ఇంకా చాలా మంది వచ్చేశారే." అంది ఆయాసపడుతూ హడావిడిగా చెప్తూ.

"ఇంకా ఎవరు వచ్చారే" అంది ఇందిర జామకాయ సంగతి మరిచి, చెట్టుమీద నుంచి కాలుతీస్తూ.

"ఆ, నీకు పెళ్ళివారొచ్చారు పద, పద" అన్నాడు చెట్టుమీదనుంచి తను కూడా దిగుతూ అన్నయ్యని చూడాలనే ఉత్సాహంతో క్రిష్ణ.

"వస్తే రానీ నాకేం భయమా!" అంటూ లోపలికి వెళ్ళింది ఇందిర. అప్పుడే ఊరునుంచి వచ్చిన అన్నయ్య శంకర్, అతని స్నేహితులిద్దరు, కుర్చీలలో కూర్చుని ఇందిర తండ్రి ప్రసాదరావుగారితో సంభాషణలో పడ్డారు వాళ్ళందరూ ఉన్నారని ఇందిర అక్కడికి హాలులోకి వెళ్ళలేదు. కిటికీ కర్టెన్ పక్కగా చూస్తే అందరూ కనిపిస్తున్నారు. అన్నయ్య స్నేహితుడు ఒకతను నల్లగా, అదే, చామనచాయ అంటారు ఆ రంగులో ఉన్నాడు. ప్రక్కనే ఉన్న ఆ రెండవ అతడు తెల్లగా ఉన్నాడు.

పేపటి, అందంగా ఉన్నాడు జుట్టు కూడా అందంగా ఉంది డ్రెస్సు కూడా బాగుంది మంచి స్టైలిష్‌గా ఉన్నాడు నవ్వుతుంటే ఎంత బాగు న్నాడు! అనుకుంది ఇందిర. అక్కడ నుంచి పక్క గదిలోకి వెళ్ళింది. ఎదురుగా టేబుల్ మీద ఉన్న అద్దం ఇందిరను పిలిచింది. జడ ముందుకు వేసుకుని కొసలు అల్లుకుంటూ ఓరగా చూసుకుంది తనను తన కేం, చక్కగా ఉంటుంది అందరూ అంటారు జమునలాగ ఉంటుందని. శారద తెల్లగా ఉంటుందని మిస్ కాలేజ్ అంటారు కానీ తనకున్న ఆకర్షణ, అందం ఆ అమ్మాయి మొహంలో ఎక్కడ ఉన్నాయ్! తను అంత తెలుపు కాదంతే.

'అన్నయ్యావాళ్ళకి కాఫీ యిచ్చి రావే ఇందూ' అమ్మ పిలిచింది వంటింట్లోంచి. తన ఆలోచనల్ని అక్కడ వదిలి, నాలుగు కప్పుల్ని ట్రేలో వుంచి తీసుకు వెళ్ళి బల్లమీద పెట్టింది ఇందిర. ముందుకు పడిన జడ చివరలను మెలిపెడుతూ 'ట్రెయిన్ లేటయినట్లుందే' అంది అన్నయ్యతో.

'ఆఁ, అరగంటు లేటు' అని, 'మా చెల్లెలు, ఇందిర' అని స్నేహితులకి పరిచయం చేశాడు.

'బి ఎస్‌సి. రెండవయేడు ఐంది' అని ప్రసాదరావుగారు అన్నారు.

ఇందిర గర్వంగా చూసింది, తెల్లగావున్న యువకుడివైపు.

'ఏ గ్రూపు?' అన్నాడతడు.

అతనికి జవాబు చెప్పి 'ఇతను మాధవరావు. మంచి స్పోర్ట్స్‌మన్. ఫోటోగ్రఫీ హాబీ. అతను రామకృష్ణ. చిన్నప్పట్నించీకూడా ఫస్టునారు. తె కాలేజి ఫస్టు, యూనివర్సిటీ ఫస్టూను. మంచి మెరిట్‌తో ప్యాసయ్యాడు పుస్తకాలు తెగ చదివేస్తుంటాడు' అన్నాడు శంకర్.

'నన్ను అంత పుస్తకాల మనిషిని చెయ్యకురా. నాకూ మామూలు ప్రపంచం అంటే ఆసక్తి వుంది' అన్నాడు రామక్రిష్ణ నవ్వుతూ.

'ఆ. వాడికి సంగీతమంటే ఇష్టం. కొన్నాళ్ళు వయొలిన్ కూడా వెలగబెట్టాడు. అయినా మగవాళ్ళకి సంగీతం ఏమిటి?' అని మాధవరావ్ నవ్వుతుంటే అతడి వైపుచూసి అతడి నవ్వుతో నవ్వు కలిపింది ఇందిర.

మీరు నవ్వుతుంటే నాకేం, నవ్వుకోండి, అన్నట్లు కూర్చున్నాడు రామకృష్ణ.

'అదేమిటిరా, సంగీతానికీ, శాస్త్రానికీ ఆడ, మగ ఏమిటి? ప్రసిద్ధ గాయకులు చాలామంది మగవాళ్ళు కాదూ' అని శంకర్ అంటుంటే 'అది కాదోయ్. మనవంటి మామూలు వాళ్ళ సంగతి. ఉద్యోగం చేసే మగవాడు పాటలు పాడటం, వంట వండటం, సంసారం చేస్తూ పిల్లలున్న గృహిణి యుద్ధం తర్ఫీదు పొందటం, సంఘసేవకి బయలు దేరటం ఎట్లా ఉంటాయి!' అని నవ్వాడు మాధవ





రావ్. మళ్ళీ నవ్వింది ఇందిర అతడి వైపు చూసి.

'ఇందూ!' ఇంతలోకి వాళ్ళమ్మ వంటింట్లోంచి పిలిచింది అయిష్టంగానే అక్కడ నుంచి వెళ్ళింది ఇందిర.

సాయంత్రం మాధవరావ్ అందరికీ ఫోటోలు తీశాడు. ఇందిర ఒక్కతే నుంచునితీయించుకుంది జడ ముందుకి వేసుకుంది. ఒక చేతికి వాచి, రెండవ చేతికి నాలుగు బంగారు గాజులు. స్క్వేర్ నెక్ జాకెట్‌లోనుంచి ఒంటిపేట గొలుసు అందంగా అమరి కనిపిస్తోంది. చక్కటి ప్రింటెడ్ చీర, ప్లెయిన్ కలర్ చోళీ ధరించింది. కోలగా బొట్టు పెట్టుకుంది.

'ఫోటో బాగా రావాలి. పెళ్ళి మావులకి పంపిస్తాము' అన్నాడు శంకర్ మాధవరావుతో.

'ఫోటో బాగా రాకపోవడమనేది మన దగ్గర ఎప్పుడూ లేదు. ఉన్నది ఉన్నట్లుగా వస్తుంది. నేను తీసే యాంగిల్‌లో ఇంకా లేనిఅందం కూడా వస్తుంది అసలు మనిషి బాగుంటే భయం ఎందుకూ' అన్నాడు మాధవరావు తయారయి నిలబడిన ఇందిరని చూస్తూ. ఇందిర నవ్వింది.

'చాలా బాగుంది. అట్లాగే ఉండండి' అన్నాడు మాధవరావ్. ఇందిర గుండె ఝల్లుమంది. చాలా బాగుంది తన నవ్వు అతడికి చాలా బాగుంది అనుకుంది. ఇంతవరకూ ఖాళీగా ఉన్న ఆమె హృదయంమీద మాధవరావ్ ముద్ర పడింది

'ఈ ఏడాదితో ఇందు చదువు అయిపోతుంది. ఈ లోగా దీనికి మంచి సంబంధం చూడాలి. నీ స్నేహితుల్లో ఎవరినైనా వెతుకు. చెల్లెలికి మంచి మొగుణ్ణి తేవటం నీ బాధ్యతే. అంత యూనివర్సిటీలో నీకు తెలిసిన వాళ్ళు ఎంతోమంది వుంటారు' అంది తల్లి శంకర్‌తో. అందరూ భోజనాలు చేస్తున్నారు.

'ఆ వుద్దేశంతో నేనమ్మా వాళ్ళిద్దరినీ యిక్కడ ఆపింది' అన్నాడు శంకర్.

'ఆ తెల్లగా వున్నతనా మాధవరావ్! మనిషి బాగున్నాడు. తల్లీ దండ్రీ వున్నారా? ఆస్తి వుందా?' తల్లి ప్రశ్నిస్తోంది.

'ఆ. వాడు లెక్చరర్ అవుతాడు. వాడికి కింకేమీ చదవాలని లేదు. వాడి తండ్రి కాలేజి ప్రెసిడెంటు వీడికి వుద్యోగం వెంటనే దొరుకుతుంది. ఉన్న వూరు. వీడే పెద్ద కొడుకు. వాడిది వర్ధించిన విస్తరి రామకృష్ణా వాళ్ళిద్దరు అన్నదమ్ములు. తండ్రిలేడు. చెప్పుకోదగ్గ ఆస్తిలేదు. ఇతనికి బాగా చదవాలని, ఫారిన్ వెళ్ళాలని పట్టుదల. అన్నదమ్ములిద్దరూ చాలా ప్రేమగా అభిమానంగా ఉంటారు. అన్నగారు బాగా గు. అతనూ కష్టపడి చదివి అభివృద్ధిగా వచ్చాడు. భాగ్యగుణ గాడు

లేట్. ఎక్కువ ఆస్తి లేదు కానీ మంచి చదువు, సంస్కారం వున్న కుటుంబం.'

'నీ అభిప్రాయం ఏమిటి? ఇద్దరిలో ఇందుని ఎవరికి అడిగితే బాగుంటుందంటావ్?' ప్రసాదరావ్ గారు కొడుకుని ప్రశ్నించారు.

'నా అభిప్రాయానికేం! ఇందుకి నచ్చాలి. మీ అందరికీ నచ్చాలి. నన్నడిగితే రామకృష్ణ అంటాను.' అన్నాడు శంకర్.

అన్నంతింటూ మాటలు వింటున్న ఇందిర, అన్నం తినటం ఆపి 'ఆ కోతి మొహమా!' అంది. శంకర్ చురుకుగా చెల్లెలివైపు చూశాడు కొంచెం దెబ్బతిన్నట్టుగా కూడా ఉండతని మొహం. పిల్లలిద్దరూ గొల్లుమని నవ్వారు. తల్లికి, ప్రసాదరావ్ గారికి కూడా నవ్వు నిలిచింది పెదవుల మీద.

'వాడిదేమీ కోతి మొహం కాదు. కాస్త నలుపతే. వాడి మొహంలో ఎంత కళ, తెలివితేటలు ఉన్నాయ్. నువ్వు సరిగ్గా చూసి ఉండవు. ఆ మాట కొస్తే నీదే గుర్రం మొహం.' అన్నాడు శంకర్ ఇందిరతో. ఇంకొక సందర్భంలో అయితే 'నీది కుందేలు మొహం' అని ఉండేదే ఇందిర. కానీ తన పెళ్ళిని గురించిన మాటలని కాబోలు మౌనం వహించి విననట్లు అన్నం తినటం మొదలు పెట్టింది.

'మాధవరావ్‌కైనా ఏమీ తక్కువ లేదు. మనిషి అందంగా ఉంటాడు. కానీ వ్యక్తిగతంగా చూస్తే రామకృష్ణ ఎక్కువనిపిస్తుంది నాకు. మనిషికి ఆలోచన, నెమ్మది కూడా ఉన్నాయి. తోటి వాళ్ళు సుఖపడాలంటే ఇవి కూడా చూడాలి కదా!' అన్నాడు.

కొడుకిట్లాగ చెప్తున్నాడు. కూతురి మనసు రెండవవాడిమీద పడింది. ఏమిటి చెయ్యటమా అని ఆలోచనలో పడ్డారు ప్రసాదరావ్ గారు.

తర్వాత భార్య ఆలోచన చెప్పింది.

'మాధవరావే అన్నివిధాలా యోగ్యుడు. తండ్రి డబ్బున్నవాడు. ఊళ్ళో పేరు పలుకుబడి కలవాడు. ఇతనూ చదువుకున్నాడు. ఉద్యోగం వుంది. అందంగా వుంటాడు. ఇవన్నీ కనిపిస్తుండగా, ఎప్పుడో ఫాన్ వెడతాడని, ఆస్తిపాస్తి లేనివాడికెందుకడగటం! తల్లిదండ్రులూ, సిరిసంపదలూ వున్న ముచ్చట వుంటుందా చదువు-సంస్కారాలు వుంటే మాత్రం. మాధవరావుకే అడగండి' అందావిడ.

ప్రసాదరావ్‌గారు మా అమ్మాయిని వచ్చి చూసుకోవలసిందని మాధవరావు తండ్రికి వుత్తరం రాశారు వెంటనే జవాబు వచ్చింది.

'మా అబ్బాయి మీ అమ్మాయి ఇందిరను చూశాడు కదా. వాడికి పిల్ల నచ్చలేదుట' అని ప్రసాదరావు గారు ఏమీ మాట్లాడలేదు. అంతా మన మంచికే అనుకున్నారేమో!

ఇందిర తెల్లబోయింది. శంకర్ ఆ వుత్తరం తీసుకుని ఇందిరదగ్గరకు వెళ్ళి 'అయిందా పరాభవం! నీ పొగరణిగిందా. ఆ మాధవ్‌గాడికి నువ్వు నచ్చలేదుట. ఇప్పుడైనా రామకృష్ణని...' అంటుంటే.

'నచ్చకపోతే పోనీ. చస్తే ఆ కోతి మొహాన్ని మాత్రం చేసుకోను' అని ఉక్రోషంతో, అపలేని కన్నీళ్ళతో అక్కడనుంచి పారిపోయింది ఇందు.

ఇందిర అమాయకత్వానికి నవ్వు, జాలి కలిగాయి. వెళ్ళిపోతున్న చెల్లెల్ని ఆమె నిరాశపడిన మనసునూ తెలుచుకుని శంకర్‌కి ప్రేమ కెరటంలా పొంగింది.

'పిచ్చి ఇందు. ఏమీ తెలియదు. రామకృష్ణ ఒప్పుకుంటే ఇందు సుఖపడుతుంది. రామకృష్ణ ఎంత తెలివైన వాడు, ఎంత మంచివాడు! ఇందుకేమి తెలుసు!' అనుకున్నాడు శంకర్.

● ● ●

ఆ మాట అంతకముందే విందిఇందు. అతడికి తను నచ్చలేదు. ఆమె గుండెలో విమానం కూలనంత అలజడి రేగింది. తన కది పరాభవం. మాధవరావ్ అందంమీద మోజు పోయింది. అసహ్యం పుట్టింది. అతడిపైన ఉన్న సదభిప్రాయం పోయింది. ద్వేషం పెరిగింది. తిండి సహించటం లేదు. ఏం చెయ్యాలి! అతడు కనిపించడు కదా, ఎట్లా ప్రతీకారం చెయ్యాలి! తోచటంలేదు. మనసుకి విశ్రాంతి లేదు. ఆలోచనలకి అంతులేదు. రెండవ రోజు రాత్రి పడుకున్నది లేచి కూర్చుని ఉత్తరం రాసింది.

మాధవరావ్‌కి,

మీకు నేను నచ్చలేదని తెలిసింది. మీకు మీరు చాలా అందంగా ఉంటారని గర్వం. ఆ గర్వంలో ఒక ఆడపిల్ల మనసు నొప్పిస్తున్నానని తెలుసుకోలేక పోయారు. అయినా నేను బాధ పడటం లేదు. తలుచుకుంటే మీ కంటె అందగాడినే పెళ్ళి చేసుకోగలను. మీరయినా ఎంతటి అందగత్తెను చేసుకుంటారో చూస్తాను.

ఇందిర.

ఉత్తరం రాశాక ఇందిరకి నిద్ర పట్టింది. మరునాడు పొద్దున్న లేవగానే అన్నయ్య డైరీలో వెతికి ఎడ్రస్ రాసి ఉత్తరం పోస్టుచేయించింది అప్పుడు మనసు శాంతించింది.

---

● భర్త: 'ఏమోయ్, ఇంకా ఎంతసేపు నీ సింగారం? సినిమాకి టైమైపోతోంది.'

భార్య: 'గంటనించీ చెబుతున్నా, ఇదిగో వచ్చేస్తున్నానని. ఎందుకలా అరుస్తారు?'

మాధవరావ్ దగ్గరనుంచి జవాబేమీ రాలేదు. ఇందిర ఎదురుచూడలేదు కూడా. ఆ ఉత్తరం అతడి కందితే చాలు అనుకుంది.

రిసెర్చి స్కాలర్‌షిప్ వచ్చింది రామక్రిష్ణకి. శంకర్ కోరికమీదట యూనివర్సిటీకి వెడుతూ ప్రసాదరావుగారింట్లో ఒకరోజు ఉన్నాడు. శంకర్ తల్లినీ తండ్రినీ ఒప్పించాడు. రామక్రిష్ణనికూడా అడిగాడు. అతడు నవ్వి 'నా కిష్టమే. ఇందిరకూడా యిష్టపడాలిగా' అన్నాడు.

ఇందిరకి యీ తంతు తెలియదు. ఆ సాయంత్రం శంకర్ సినిమాకి బయలు దేరదీశాడు. తను తయారయి వచ్చింది మొదలుకుని రామక్రిష్ణ మాటిమాటికీ తనవైపు చూస్తూండటం గమనించింది ఇందిర.

'ఎందుకట్లాగ చూస్తాడు. ఏదో విమర్శగా చూస్తున్నట్లు! ఇప్పుడతడిని ఎవరూ వరించబోవటం లేదు' అనుకుంది మనసులో. వినుక్కుంది కూడాను. తను అతడిని ఆకర్షిస్తోంది అనుకుని గర్వం కూడా కలిగింది. మాధవరావ్‌నచ్చలేదంటే నేం! ఇంకా తెలివైన వాళ్ళని, చాలా మందినే ఆకర్షించగలను అనుకుంది. ఇంటికి వచ్చి పడుకునేలోగా తనలో దెబ్బతిన్న అహం తిరిగి వచ్చింది. పాపం రామక్రిష్ణ! అని నవ్వుకుంది, అతడు తనవైపు చూడటం గుర్తు వచ్చి.

● ● ●

మరునాడు తెల్లవారకుండానే ఇందిరని లేపేశాడు శంకర్. బద్ధకంగా లేస్తూ.

'ఏమిటీ తొందర! ఇంకా తెల్లవారినట్లు కూడా లేదు' అంది ఇందిర.

'నువ్వు లేచిరా! తెల్లవార లేదు. కానీ బయట ఎంత బాగుందో చూడు. నేనూ రామకృష్ణా వరండాలో కూర్చున్నాము. అతను పాట పాడతాడు' అన్నాడు. ఇందిర నవ్వింది.

'ఇవేం పెళ్ళి చూపులా! అతను పాడటమేమిటి! నా కక్కరలేదు' అంది.

'నువ్వు ఉత్తమొద్దువి. కొంచెం సేపు ఆ ప్రకృతి సౌందర్యాన్ని, ఆ గాన మాధుర్యాన్ని అనుభవించటానికి హృదయం లేదు. హృదయంతో పాడగలవాళ్ళు ఎంతమంది ఉంటారని! అనుభవించటానికి అదృష్టం ఉండాలి. ఆడవాళ్ళకి మంచి అభిరుచులు ఉంటాయంటారు. నీ కంటె నేనే నయం'

'పద నీ సాధింపు నేను భరించలేను. నీ కేమో అతడు నచ్చాడు. నాకు రుద్దాలని నీ తాపత్రయం. వింటే నా సొమ్మేం పోయిందిలే. పద.'

ఇందిర వెళ్ళి వరండాలో మూడవ కుర్చీలో కూర్చుంది.

'ఇంకా మీకు మత్తు వదిలినట్లు లేదు' అన్నాడు రామక్రిష్ణ.

'ఊహు' అంది ఇందిర.



'నేను మెయిల్‌కి వెడుతున్నాను' అన్నాడతడు.

'ఊ' అంది మళ్ళీ.

ఇంకా వెలుగు రాలేదు. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. గాలిలో చిరుచలి ఉంది. ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉంది. అక్కడ కూర్చున్నాక ఇందిరకు బద్ధకం వదిలిపోయింది.

'ఒక పాట పాడు' అన్నాడు శంకర్.

'ఇప్పుడేమిటి!' అన్నాడు రామక్రిష్ణ.

'ఏమీ లేదు. నా కోరిక. ఈ వేళలో వినాలని ఉంది. ఇందును కూడా అందుకే లేపుకు వచ్చాను.' అన్నాడు శంకర్. రామక్రిష్ణ ఇందిర వైపు చూశాడు. ఇందిర నవ్వింది. కొంచెంసేపాగి ఒక అష్టపది పాడాడు రామక్రిష్ణ.

'బాల మురళీకృష్ణలాగ ఏ...రు' అంది ఇందిర.

'మీకు సంగీతం అంటే ఆసక్తి ఉందా ?' అడిగాడు రామక్రిష్ణ.

'వినటం వరకే. చాలా బాగా పాడితే ఇష్టంగా వింటాను' అంది ఇందిర.

శంకర్ లోపలికి వెళ్ళాడు. కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

'మీ వాళ్ళ అభిప్రాయం తెలిసింది. నాకు అంగీకారమే. కాని నాకు మీ అభిప్రాయం కూడా తెలుసుకోవాలని ఉంది. మీకేమీ అభ్యంతరం లేదుకదూ. పూర్తిగా ఇష్టమే కదూ' అన్నాడు రామక్రిష్ణ సన్నగొంతుతో మెల్లగా. నిద్రలో ఎవరో లేపినట్లు ఉలికిపడింది మనసులో. కళ్ళు వెడల్పు చేసి చూసింది ఇందిర. తనకు తెలియకుండా ఇంట్లో ఏదో ప్రయత్నం జరుగుతోంది. తనపెళ్ళి ఆలోచన చేస్తున్నారు. తనను ఎవరూ అడగలేదు. కానీ వాళ్ళ అంగీకారం తెలియకుండా ఇతనెట్లా అడుగుతాడు! అమ్మమీద, నాన్నమీద, అన్నయ్యమీద చెప్పలేని కోపం పొంగుకువచ్చింది. కన్నీళ్ళువచ్చాయి.

'నాకా విషయమేమీ తెలియదు. నాకు మీమీద ఏ అభిప్రాయమూ లేదు. అన్నయ్య పాట వినమంటే ఊరికే వచ్చాను. అంతే. నాకంత కంటే సంబంధం లేదు. ఇష్టంలేదు. క్షమించండి' అని లేచిపోయింది అక్కడనుంచి. శంకర్ వచ్చేటప్పటికి అక్కడ ఇందిర లేదు. కుర్చీలో వెనక్కివాలి రామక్రిష్ణ మౌనంగా ఉన్నాడు. అతడి పెదవులమీద సన్నటి నవ్వు ఉంది. శంకర్‌కి ఏమీ అర్థం కాలేదు. అప్పటికి తెల్లవారింది. ముఖాలు కడుక్కొని కాఫీ త్రాగి స్టేషన్‌కి వెళ్ళి పోయారు.

● ● ●

'మీ ఇందిరకి ఇష్టంలేనిదే నేను ఒప్పుకోలేను. తనకు ఇష్టమేనని ఇందిర వ్రాస్తే వివాహానికి నా అభ్యంతరం లేదు. నాకు ఇష్టమే.' అని రామక్రిష్ణదగ్గరనుంచి వుత్తరం వచ్చింది శంకర్‌కి. ఒకసారి శంకర్ ఇందిరదగ్గరకు వెళ్ళి 'ఏమిటి నీ అభిప్రాయం? మాధవరావు గురించి ఆలోచిస్తున్నావా ? అది జరిగేసంగతి కాదు. అతడి పెళ్ళి నిశ్చయమైపోయింది' అన్నాడు.

ఇందిరకి ఒళ్ళు మండిపోయింది.

'మీ యిష్టంవచ్చినట్లు చేసుకోండి. ఆ మాధవరావు పేరుమాత్రం నా దగ్గర ఎత్తకు. నచ్చలేదన్న వాడికోసం ఏడిచేవాళ్ళెవరూ లేరిక్కడ' అంది.

అదీ మంచిదే అనుకున్నాడు శంకర్. వెంటనే రామక్రిష్ణకి వుత్తరం రాశాడు. 'మా అందరికీ యిష్టమే, పెళ్ళి నిశ్చయం చేసుకుందా'మని. దానికి రామక్రిష్ణదగ్గరనుంచి వచ్చిన జవాబది—

ఇందిర కిష్టంలేదని అతడికెవరు చెప్పారు? ఇందిరే చెప్పిందా? అతడికి చిరాకు వేసింది. ఇందిరదగ్గరకువెళ్ళి వుత్తరం చూపించి 'నీ కిష్టం లేదని నువ్వు చెప్పావా?' అనడిగాడు.

'నా ఇష్టంతో ఏం పని అన్నయ్యా నా కిష్టమేనని రాసిస్తా. ఆ పెన్ను ఇవ్వు' అంది ఇందిర. ఒక క్షణంసేపు తను తొందరపడి చెల్లెల్ని బలవంతం చేస్తున్నానేమో అనిపించింది శంకర్‌కి.

'అది కాదు ఇందూ. నీ మంచిచెడ్డలు మేము ఆలోచించమూ! నువ్వు సుఖపడాలని కోరుకునేవంతా. రామక్రిష్ణ సంగతి నాకు బాగా తెలుసు. నీకు తెలియదు. అందుకే నేను ఇంత గట్టిగా, బలవంతమని నీ వనుకున్నా పట్టుదల వహించటం. నువ్వు కన్నీళ్ళు పెడితే మాత్రం నే నీ పని చెయ్యలేను.' అన్నాడు. అర్ద్రమౌతున్న కళ్ళు తుడుచుకుంది ఇందిర.

'కాను, నాకు తెలియదన్నయ్యా. నువ్వు, నాన్న కంటె నా మంచిని కోరేవాళ్ళెవరు! నా కంటె ఎక్కువగా నా మంచిని గురించి ఆలోచించగలిగిన వాళ్ళు మీరే. ఏమిటో అతడిమీద నాకు ఏ అభిప్రాయమూ కలగలేదంతే. అతడు మంచివాడు, ఎన్నతగిన వాడయి ఉండవచ్చు. నీకు తెలుసు కదా. నేను\ అతనికే వ్రాస్తాను అన్నయ్యా' అంది.

మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి అని అన్నప్పుడే ఇందిరకి అనుమానం కలిగింది. ఈ పెళ్ళి అయేట్లు ఉంది అని. తనకి ఇష్టంలేని పెళ్ళి చేస్తున్నారని బాధ కలిగింది. అన్నయ్యవచ్చి రామక్రిష్ణ ఉత్తరం చూపిస్తుంటే ఏమిటీ బలవంతమని కోపం వచ్చింది. ఏమిటీ రామక్రిష్ణ — వదలిపెట్టడు. తన కిష్టమేనని రాసివ్వాలట! ఎందుకు రాసివ్వాలి? ఇష్టం లేదని చెప్తే ఊరుకోకూడదూ. ఇష్టమేనని అన్నయ్య చెప్తే ఒప్పుకోకూడదా. కోపంతో చిరాకుతో తను రాసిస్తానంది కానీ అన్నయ్య అనునయం విన్నాక తనమనసు మారిపోయింది. నిజంగా తను తన మంచి తెలుసుకోలేకపోయి ఉండవచ్చు. రామక్రిష్ణ ఎన్నుకుని స్వంతం చేసుకోతగినవ్యక్తి కాబోలు. లేకపోతే అన్నయ్య ఎందుకట్లాగ చెప్తాడు. బలవంతం చేస్తాడు అనుకుంది. చెల్లెలి మొహం ప్రశాంతంగా ఉండటం చూసి తృప్తిపడ్డాడు శంకర్.

'మీరు అడిగినప్పుడు నేను ఎదురు చూడక పోవటం వలన ఏదో సమాధానం చెప్పాను. అప్పటికి నేనేమీ ఆలోచించుకో లేదు. ఇప్పుడు ఆలోచించి నిర్ణయించుకున్నాను. నాకు ఇష్టమే — ఇందిర' అనిరాసి ఎడ్రస్ రాసిఉన్న కవరులో పెట్టి శంకర్‌కి ఇచ్చింది. శంకర్ సంతోషంగా నవ్వాడు. ఇందిర సిగ్గుపడింది.

ఉత్తరం రాశాక తరచూ గుర్తు వస్తున్నాడు రామక్రిష్ణ — ఇందిరకి. నిజమే, అన్నయ్య అన్నట్లు అతని ముఖంలో కాంతి అకర్షణా ఉన్నాయి. అనుకుంది. ఆ రోజు అతను చూసిన

చూపులు గుర్తువచ్చాయి. అతడికి తనంటే ఇష్టంఉంది. ఇందిరకి తృప్తి కలిగింది. అతడంటే కోరికకూడా కలిగి తనలోనే నవ్వుకుంది. అతడిని కోతి మొహం అంది. అతడినే పెళ్ళి చేసుకోబోతోంది. మొత్తానికి ఇష్టం లేదని చెప్పినా అతడు మాత్రం తనను వదలలేదు. ఇష్టమేనని చెప్పించుకుని మరీ పెళ్ళిచేసుకుంటున్నాడు. అదీ అతనిలో ఒక అధిక్యతేనేమో! అర్థం చేసుకోవటం అంటే ఇదేనేమో! తనూ జీవితంతో సమాధాన పడుతోంది. అట్లా పడక తప్పదు కాబోలు అనుకుంది ఇందిర.

ఆ వేసంగిలో ఇందిరకు పెళ్ళి అయింది రామక్రిష్ణతో. బి. ఎస్సి. కూడా పూర్తయింది.

● ● ●

"నేనంటే ఇష్టం లేదన్నావుగా. ఎట్లా పెళ్ళి చేసుకున్నావు నన్ను" రామక్రిష్ణ ఇందిరను అడిగాడు.

"ఇంకా మీకు జవాబులు చెప్పుకోవాలా? ఇష్టమేనని రాసిచ్చాను కదా" అంది ఇందిర నవ్వుతూ.

"ఔను, నాకు నమ్మకం లేదు. నువ్వు బలవంతంగా ఈ పెళ్ళి చేసుకున్నావనే నాకు అనుమానం."

"ఏం. మీ రెండుకు నమ్మకపోవాలి! నమ్మనప్పుడు పెళ్ళి ఎందుకు చేసుకోవాలి!" అంది ఇందిర. ఆమె మొహంలో మార్పుల్ని చూస్తూ,

"నువ్వు వాడికి రాసిన ఉత్తరాన్ని మాధవ నాకు చూపించాడు. వాడికి తెలియదు మనిద్దరికీ పెళ్ళి మాటలు జరుగుతున్నాయని. పెళ్ళి అవుతుందని అన్నాడు."

"అయితే మీకు తెలిసే పెళ్ళికి ఒప్పుకున్నారా? అయినా ఉత్తరం రాస్తే తప్పా!"

"అట్లాగ ఉత్తరం రాయకూడదు. నేను ఒప్పుకున్నానంటే నాకు ముందర నుంచీ ఇష్టమే. ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే బాగుంటుంది అనుకున్నాను. చేసుకున్నాను. ఉత్తరం రాయకూడదు కానీ, ఇందు చాలా మంచిపిల్లని నాకు తెలుసు."

"మీకు రాయవచ్చేం, ఉత్తరం" అంది ఇందు కొంచెం ఎత్తిపొడుపుగా.

"ఆ నాకు రాయవచ్చు. నేను ఎట్లాగూ పెళ్ళి చేసుకుంటున్నాను కదా!"

"మరిఅంతా అయ్యాక అనుమానాలెందుకు!"

"అనుమానాలు కాదు ఇందూ. నువ్వు అందమైన పిల్లవి. అందంగా ఉంటానని అనుకుంటావు. నిజమే. నాకు అందంలేదు. అట్లాగని అంద వికారినని అంటే నేనూ ఒప్పుకోను. కానీ నాలోని అనురాగమంతా నీ కోసమే. నీకివాళ అర్థం కాకపోవచ్చు కానీ, ఏదో ఒక రోజున తప్పకుండా నీకు తెలుస్తుంది."

"మీరూ తెలుసుకోండి. నేను అందమైనదానిననే అనుకుంటాను. అందంకోసం ఆరాటపడతాను కూడాను. కానీ నా మనసులో మాత్రం ఎవరికీ ఆరాధనలేదు. ఎప్పటికైనా ఎవరైనా నా మనసులో నిలిస్తే అది మీరే అవుతారు. లేదా అది ఖాళీగానే వుంటుంది" అంది.

రామక్రిష్ణ ఆమెని దగ్గరగా తీసుకుని "నాకు తెలుసు ఇందూ" అన్నాడు.

ఇందిర మనసూ కళ్ళూ కూడా ఆర్ద్రాలయ్యాయి. అప్పుడు అతడు అందంగా వుండ డనిపించలేదు. అతని కళ్ళు చిన్నవనిపించలేదు. అతడు నల్లగా వుంటా డనిపించలేదు. అతడు తన భర్త. తన ప్రేమకి ఆధారం. తనను అతని సర్వంగా భావించేవాడు. తా మిద్దరివీ ఒకటే సుఖ దుఃఖాలు!

● ● ●

"నీకు చదువుకోవాలని వుంటే ఎమ్మెస్సీలో జేరు" అన్నాడు రామక్రిష్ణ.

యూనివర్సిటీలో చేరింది ఇందిర. నాలుగునెలలు గడిచాయి. ఇందిరకి ఒంట్లో బాగుండేదికాదు. మనసు కూడా చిరాకుగా వుండేది. క్లాసులకు వెళ్ళబుద్ధి వేసేదికాదు. ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తుండేది. రామక్రిష్ణ వర్క్ చేసుకోవటంలో చాలా శ్రద్ధగా ఉండేవాడు. అతడు చాలా నియమబద్ధంగా ఉంటాడు దినచర్యలో. ఇందు అంటే ఎప్పుడూ ఆపేక్ష. ఎప్పుడూ ఒకమాట అనటం కానీ, కోపం తెచ్చుకోవటం కానీ జరగలేదు. చదువుమీద శ్రద్ధ లేదని మాత్రం హెచ్చరిస్తూండేవాడు.

"నాకింకేమి చదువు!" అనుకునేది విరక్తిగా ఇందిర. తనకి ఆరో

---



ఒకాయనకు చెయ్యి వాచింది. డాక్టరుగారు పన్నెండు గంటలసేపు మరుగుతున్న నీటిలో చేతిని నానెయ్యమన్నారు. తగ్గకపోగా ఒళ్ళంతా వాచింది. ఇంటి పని మనిషి వచ్చి ఇంతకంటె చన్నీళ్ళు నయం అంది. చన్నీళ్ళలో ముంచి వుంచితే వాపు తగ్గింది.

ఆయన డాక్టరు దగ్గరికెళ్ళి "ఏం డాక్టరువయ్యా నువ్వు? నీ కంటె మా పనిమనిషి నయం. నువ్వేమో వేణ్ణీళ్ళన్నావ్. ఒళ్ళంతా ఉబ్బింది. అదేమో చన్నీళ్ళంది. వాపు తీసింది" అని కోపంగా అన్నాడు.

డాక్టరు "అరె. తమాషాగా వుందే. మా ఇంటి పని మనిషి మరుగుతున్న నీళ్ళలో ముంచమని చెప్పిందిస్మండీ" అన్నాడు.

గ్యం బాగుండలేదు. కారణ మేమిటో తెలీసు ఇందిరకి. త్వరలోనే తనకొక పాపాయి! ఇక తనకు చదువేమిటి!

ఎందుకీ అసంతృప్తి? తన మనసుకీ, అలా చెయ్యడానికీ నిలకడ లేదు. ఎందుకీ చాంచల్యం? రామకృష్ణ అంటే ఎంత మమకారం ఏర్పడినా ఏమిటని అతడిని చేసుకున్నాను అనే ప్రశ్న మధ్య మధ్యలో ఆమెకి కలుగుతూనే ఉండేది. అందం లేదు, ఎక్కువ డబ్బు లేదు. తమిద్దరికీ కలిసిన సరదాలూ లేవు, ఏమిటీ జీవితం!

అతడి చదువు, ఆసక్తి అతడివి. అతడికి తన మీద అచంచలమైన ప్రేమ ఉంది. అతడిది ఎంత దృఢమయిన మనసు! తన మనసులో ఎంత బలహీనత! అతడిలో మంచి, తను రాగంతో సి, ఒప్పుకుని పెళ్ళి చేసుకుని కూడా అసంతృప్తితో బాధపడటం బలహీనత కాదా! మాధవరావు అంటే ఒకప్పుడు తను ఇష్టపడినట్టు కూడా అతడికి తెలుసు. తెలుసుకనక తనచేత ఇష్టమేనని చెప్పించుకుని మరీ పెళ్ళి చేసుకున్నాడు. తిరిగి అతడా విషయాన్ని ఎప్పుడూ గుర్తుచేసుకోలేదు. మరి అతడెంత మంచివాడు!

'నేనే బలహీనురాలిని' అనుకునేది ఇందిర కానీ, పెళ్ళి చేసుకోవటంలో తొందరపడ్డానేమో? ఈ లోకంలో మాధవరావు, రామకృష్ణ తప్ప యింకెవరూ లేరా? అమ్మా వాళ్ళు నాకింకా మంచి సంబంధం తీసుకురాగలరు. ఎందుకంత తొందర! నాకు మిగిలిందేమిటి? ఈ చదువు ఎట్లాగూ సాగదు. ఇంక మామూలుగా సంసారం, పిల్లలు, సమస్యలు, తాపత్రయాలు. నా జీవితానికి యిదే అర్థమా!' అనుకుని తీరని అసంతృప్తితో బాధపడుతుండేది.

రామకృష్ణ దగ్గర వున్నంతసేపూ యీ ఆలోచనలు దగ్గరకు వచ్చేవి కావు. అతడి సాన్నిధ్యంలో అసంతృప్తిని తాత్కాలికంగా మర్చిపోయేది. అప్పుడప్పుడు ఇటువంటి వాడిని పొంది అసంతృప్తి పడట మేమిటని తనను తనే నిందించుకునేది. ఈ అవస్థలో కొన్ని దినాలు గడిచాయి.

● ● ●

ఆ సంవత్సరం ఆఖరున బాగా చదవలేదని పరీక్షలకి వెళ్ళలేదు ఇందిర.

'ఇంక నాలుగేళ్ళదాకా మనకి మళ్ళీ పాపాయి వద్దు ఈలోగా నువ్వు ఎమ్మెస్సీ పూర్తిచేద్దువుగాని. వంట్లో బాగుండక పోతే నువ్వు మాత్రం ఎట్లాగ చదువుతావు! పరీక్షలకి వెళ్ళలేదని బాధపడకు' అన్నాడు రామకృష్ణ ఇందిరను ఓదారుస్తూ. ఇందిర నవ్వుకుంది. అసలు ఇందుకే చదువుధ్యాస పూర్తిగా పోయింది. ఆ వేసవి కాలంలో ఇందిరకి కొడుకు పుట్టాడు. వాడు నల్లగానే ఉంటాడు అన్నారంతాను.

'వీడు కోతి మొహమేనే ఇందిరక్కా' అన్నాడు క్రిష్ణ. అందరూ నవ్వారు. ఏమైనా అనుకుంటారు అనుకోకుండా హాస్యాలు చేసుకోవటం ఆ ఇంట్లో అలవాటే. ఎవరూ నొచ్చుకోవటం కూడా అలవాటు లేదు. ఇందిర మొదట నవ్వేసింది కానీ, తరవాత ఆమాట మనసులో నిలిచిపోయింది. పసివాడిని చూస్తుంటే 'కోతి మొహం' అనే మాటే అనిపించేది. అది తను అన్న మాటే కానీ తమ్ముడు అంటే తనకు బాధవేసింది. బావగారి పోలిక అని వాళ్ళు చెప్పటం! అవును. ఆఖరికి తను కోతి ముఖం అన్నవాడినే తను పెళ్ళి చేసుకుంది. పోనీ తన పిల్లలైనా అందంగా ఉండకూడదూ. పోలికలు ఎక్కడికి పోతాయి! అందంగా ఉండటం, అందం అనుభవించడమూ కూడా అదృష్టమే.

'నాకు ఏ అదృష్టమూ లేదు. వీడు నాకు ముద్దుగా రావటం లేదు' అనుకుంది పురిటిలో ఉండగా ఇందిర. ఇందిరలో అసంతృప్తి ఎక్కువయింది. తరవాతకూడా ఎక్కువ ముద్దు చేసేది కాదు, పిల్లవాణ్ణి.

రామకృష్ణకి మాత్రం వాడంటే చాలా ముద్దు.

'మీలాగే ఉంటాడని మీకు ముద్దు' అని నవ్వేది ఇందిర.

'నీకు ముద్దులేదా?' అని అతడు అడిగితే,

'అందంగా ఉంటే కానీ నాకు ముద్దురారు' అంది ఇందిర.

అతను నొచ్చుకున్నాడేమో నని అనుకుంది ఇందిర. కానీ అతడేమీ అనలేదు. ఇందిర తనలోనే ఆశ్చర్యపడింది. అసలు అతడికి ఫీలింగ్స్ అనేవి లేవా? ఉంటే మనసులో బాధపడతాడా? ఇందు ఏమున్నా ఫర్వా లేదనుకుంటాడా? అనుకునేది.

మళ్ళీ 'అతనిది చాలా సున్నితమైన మనసు. అటువంటివాడ్ని ఎందుకన్నాను! తప్పకుండా బాధపడే వుంటాడు.' అనుకుని బాధపడేది.

'ఐనా ఇప్పుడింక నాకా అతిశయం ఎందుకు?' అనికూడా అనుకునేది.

ఐనా రోజులు గడుస్తున్నకొద్దీ అసంతృప్తి ఎక్కువవుతూనే వుంది తనకి ఏదైనా ఆధిక్యం వుండాలనే ఆరాటమూ కలుగసాగింది. అతడికి అందము లేదు. డబ్బు లేదు, సరదాలూ లేవు కానీ, అతడు తెలివైనవాడు. కాని యీ చదువు నెవరు గౌరవిస్తారు, గుర్తిస్తారు! అతడు ఫారిన్ వెళ్ళిరావాలి స్టేట్స్‌కి వెళ్ళి రావాలి. అప్పుడు అతని గొప్ప అతని

---

● ఫ్యాక్టరీని తనిఖీ చేయడానికి వచ్చిన ఇన్‌స్పెక్టర్ యజమానితో :

'మీ ఫ్యాక్టరీలో ఎంతమంది వుంటారు పనిచేసేవాళ్లు?'

యజమాని : 'సగం మంది వుంటారండి.'

భార్యగా తన అధికృం! అవును రామకృష్ణ అమెరికా వెళ్ళాలి. అతడికి ఆ అవకాశం ఎప్పుడు వస్తుంది? అది ఇందిరలో పెద్దకోరికై కూర్చుంది.

రామకృష్ణకి డాక్టరేట్ వచ్చింది. ఆ సంగతి చెప్పినప్పుడు రామకృష్ణ ఎదురు చూసినంత ఆనందం ఇందిరలో కనిపించలేదు అతడికి.

"నీకు సంతోషంగా లేదూ" అన్నాడతడు.

"నా సంతోషానికేంగానీ మీకిది ఒక లెఖ్ఖా! మీ తెలివి తేటలకి, ఆసక్తికి, మీరు అమెరికా వెళ్ళి పేరు పొందవలసిన వారు." అంది ఇందిర. అతడు ఒక నిముషం ఊరుకుని.

"ఆరోజూ వస్తుందిలే, ఇందూ" అన్నాడు.

కానీ ఇందిరకి ఆరోజు ఎన్నటికో అనిపించింది. తన అసంతృప్తి ఎట్లా తీరుతుందో ఆమెకే అర్థం అయ్యేది కాదు. తనకేదో అన్యాయం జరిగిందని బాధ. అతడికి దూరంగా ఉండాలనే ఆలోచన వెంటాడేది. చివరికి నిశ్చయించుకుంది పుట్టింటికి వెళ్ళి అక్కడ ఉద్యోగం చెయ్యాలని. అక్కడకు వెళ్ళి రామకృష్ణకి ఉత్తరం రాసింది.

"ఏమిటో నాకు మనసు నిలకడ పోయింది. కొన్నాళ్ళు అందరికీ దూరంగావుండాలనిపిస్తోంది. ఇక్కడ పూరికేవుంటే తోచదు. ఇక్కడ నేను చదువుకున్న స్కూల్లో ఖాళీ వచ్చింది టీచర్కి. హెడ్‌మిస్ట్రెస్ వుద్యోగం యిస్తానంది, నాలుగునెలలు టెంపరరీగా. చేరుతున్నాను ... ..."

భార్య ఏ పరిస్థితుల్లో భర్తకి దూరంగా వుండాలని కోరుకుంటుంది, అకారణంగా! ఇంతుతనకి దూరంగా వుండాలని ఎందుకు కోరుకుంటోంది! అసంతృప్తేకదూ.

"నాకు అందం లేకపోవటం ఇందుని యింకా బాధిస్తోందా? నా మనస్సు, మమత ఇందు చిత్తచాంచల్యాన్ని అరికట్టలేకపోయాయా?" అనుకున్నాడు రామకృష్ణ.

● ● ●

ఇందిర వుద్యోగంలో చేరి రెండు నెలలు గడిచాయి.

"రెండు నెలలు ఎట్లాగడిచాయో! ఏమిటీ బ్రతుకు! నా మీద నాకే కోపం. రామకృష్ణ మంచివాడు" అనుకునేది. అతనిమీద జాలి కలిగేది కానీ, అతడి దగ్గరకు వెళ్ళాలనుకునేది కాదు. అసంతృప్తి స్థానంలో ఒకరకమైన కాఠిన్యం స్థావరం ఏర్పరచుకో మొదలు పెట్టింది ఆమెలో. ఒకరోజు రామకృష్ణ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది ఇందిరకి — అతడు అమెరికా వెడుతున్నట్లు, స్కాలర్‌షిప్ వచ్చినట్లు. ఆమెలో పేరుకున్న కాఠిన్యం ఏమయిందో! అతడు దూరమైపోతాడని, వెంటనే బయలుదేరి అతడి దగ్గరకు వెళ్ళింది.

"మళ్ళీ నేను వచ్చేటప్పటికి నువ్వు చాలా పెద్దవాడివయి పోతావురా బాబూ! నడుస్తావు, మాట్లాడతావు. నీకు అక్కడనుంచి ఏమేమికావాలో నాకు ఉత్తరాలు రాస్తావుకదూ" అని ఏడాది కొడుకును ఎత్తుకుని ముద్దులాడాడు రామకృష్ణ.

"ఏడాది ఉండాలా!" అడిగింది ఇందిర.

"ఏడాది అని వెడుతున్నాననుకో. అక్కడికి వెళ్ళాక ఇంకో రెండేళ్ళు ఉండచ్చు. పైకి రావాలంటే అక్కడ ఉంటేనే ఏదైనా చెయ్యగలుగుతాము."

ఇందిర కళ్ళలోనుంచి నీటిబొట్లు జారాయి.

"అదేమిటి ఇందూ" అన్నాడు రామకృష్ణ.

"ఇప్పుడు మీరు వెళ్ళకపోతే నేం?" అంది ఇందిర.

అతడు నవ్వాడు.

"కాదు. వెళ్ళాలి ఇందూ. ఇది నా చిరకాల వాంఛ. అవకాశం వచ్చింది. అయినా ఇప్పుడు నాకొక పేరా, ప్రతిపత్తా! అమెరికా వెళ్ళి వచ్చానంటే నీకు మాత్రం తక్కువ గౌరవమా! ఫలానా ఫారిన్ రిటర్న్‌డ్ భార్య అంటారు. మంచి శాలరీకూడా వస్తుంది."

ఇంక అతడిని అర్థించలేదు.

అతడు నిజంగా చెపున్నాడో, తనను కించ పరుస్తున్నాడో! అనా అతడు తనను ఏమనినా తప్పులేదు. తను ఇనాళ్ళూ అతనిపట్ల అసంతృప్తి వహించినందుకు, దూరంగా వుండాలనుకుని వుద్యోగంలో చేరినందుకు తగిన శిక్ష యిది. తనమనసే చెప్తోంది

అతడిని విడిచి ఏడాది వుండటం ఎట్లా! తను కోరుకున్నది! కాని


మా కొత్త ప్రొడక్టునై నిరీక్షించుడు.

ఐటెక్స్ కుంకుం పేస్టు






అన్నిచోట్లా లభించును

అరవింద్ లేబరేటరీస్
పో. బా. 1415 — మద్రాసు–17.

ఇప్పుడా కోరిక నెరవేరటం తను సహించలేకపోతున్నది.

"కావాలని దూరంగా వెళ్ళి ఉద్యోగంలో చేరిన నేనేనా, ఇప్పుడు అతడు దూరమౌతున్నాడని బాధపడుతోంది" అనుకుంది ఇందిర. "నా మనసే నాకు తెలియదు" అనుకుంది కన్నీళ్ళతో.

అతడు ప్రయాణ సన్నాహాలలో తీరిక లేకుండా వున్నాడు.

"ఇప్పుడున్న ఉద్యోగం చాలు. మీరు వెళ్ళకపోతేనేం!" అంది ఇందిర.

"అది సంభవం కాదు ఇందూ. ఇప్పుడు దూరమవుతున్నామనే బాధలో నీ వట్లా గంటున్నావు కానీ, అక్కడనుంచి నేను తిరిగి వచ్చాక నీకు కలిగే సంతోషంలో ఇదంతా మరిచిపోతావు."

"నేను ఉండలేను." అంది ఇందిర.

అతడు నవ్వి "ఏం, నేను రానని భయమా. నేను తప్పక తిరిగి వస్తాను ఇందిరా, నీ మీద మమకారమే నన్ను క్షేమంగా ఇక్కడికి తీసుకు వస్తుంది. నువ్వు మాత్రం అనవసరపు విచారాలు పెట్టుకోకు. మళ్ళీ మీ వారు ఒక ప్రతిపత్తి ఉన్న వ్యక్తిగా తిరిగి వస్తారని, నీ ఆధిక్యం పెరుగుతుందని, మనం ఇప్పటికంటె సంతోషంగా, సుఖంగా ఉంటామని మాత్రమే అనుకుంటూ ఉండు. నీ కే కష్టం ఉండదు." అన్నాడు రామక్రిష్ణ.

ఇందిర కన్నీళ్ళను మనసులోనే మింగింది.

"నాకు తెలుసు ఇందూ" అన్నాడతను ఒకసారి అవును అతడికి నా మనసంతా తెలుసు, నా ఆలోచనలన్నీ తెలుసు. "రామక్రిష్ణ ఎంత మెత్తని వాడో అంత కఠినుడు కూడాను. అతడు వెళ్ళి తీరతాడు." తన కన్నీళ్ళు ఇప్పుడు అతడిని ఆపలేవు. మెత్తని మనసుతో ప్రేమించాడు కానీ తను దగ్గరగా వెళ్ళలేదు. అతడు కాఠిన్యం వహించి వెళ్ళిపోతున్నాడు. తలచింది సాధించుకుని వస్తాడు.

"ఆ మాటకి వస్తే బాబుని నన్ను విడిచి వెడుతున్నందుకు అతడు నాకంటే ఎక్కువగానే బాధపడుతూ ఉంటాడు. అయినా అతడు దాన్ని సహించగలడు. అతడు పురుషుడు. ఉత్తముడైన వ్యక్తి కూడాను నేనే అతడికి తృప్తికరంగా ప్రవర్తించలేకపోయాను. నా అసంతృప్తి నెపధిచి అధికం చేసుకున్నాను కాని, అతడిని అర్థం చేసుకుని కూడా అనుకూలంగా ఉండి ఆనందం పొందలేకపోయాను. అతడు కఠినంగా ఉండవలసినదే. నాకీ శిక్ష కావలసిందే. అతడు తిరిగి వచ్చేలోపల ఎన్ని కన్నీళ్ళు కార్చాలో! ఎంత వేదన సహించాలో!" అనుకుంది ఇందిర.

రామక్రిష్ణ వెళ్ళిపోయాడు. ఇందిర ఆ ఉద్యోగమే ఇంకొక ఏడాది చెయ్యటానికి అంగీకరించింది.



ఒక ఏడాది! రామక్రిష్ణ వెళ్ళిపోయాడు!

తమ ఇద్దరి మధ్యా సముద్రాలు, కొన్ని వేల మైళ్ళ భూమి, విమానాల ప్రయాణం! తను కోరుకున్నా అతడి దగ్గరకు వెళ్ళలేదు, అతడు రాడు.

తమ ఇద్దరి మధ్యా ఏడాది దూరం!

మనకూ సూరీడుకూ మధ్య నుందేనా! మరిగి నా మనసు సాగరమాయె నన్నారు. ఇంతేనా ఆ సంద్రము! అనిపించింది తనలో మరిగిన వ్యథ ఇందిరకి.

చిన్న కళ్ళు అనుకున్న అతడి నేత్రాలు ఇప్పుడు ఆమె జీవన జ్యోతులు. అతడు ఆమె ఆనందానికి నిలయం అతడి పునరాగమనమే ఆమె ఏకైక నిరీక్షణ. ఆమె ఇంకెన్నడూ తనలో అసంతృప్తికి చోటివ్వదు. ఇంక ఆమె మనస్సులో చాంచల్యం లేదు పశ్చాత్తాపం, విరహం ఆమెను కడిగివేస్తున్నాయి. ఆమెకు మిగిలిన ఆలోచన ఒకటే— అతడు తిరిగి రావటం.

"రామక్రిష్ణ తప్పక తిరిగివస్తాడు! ఆ రోజు తప్పకుండా వస్తుంది. మళ్ళీ నాలో ఆనందం నెలకొంటుంది" అని తనకు తానే ధైర్యం చెప్పుకుంటూ వుంటుంది ఇందిర.

ఇష్టపడి వివాహం చేసుకోవటం, ఆ వ్యక్తికోసం బాధపడటం ప్రేమనిపించుకుంటుంది. ఇష్టం లేకపోయినా పెళ్ళికొప్పుకుంది. అతడిని ప్రేమించాలనే అనుకుంది. అతడి విలువ తెలుసుకుంది. మమకారం పెంచుకుంది. కానీ ఆ మనసులో చాంచల్యం! ఆ ప్రేమకి నిలకడ లేదు.

అతడంటే మమకారం — అసంతృప్తి కూడాను. ఈ రెండిటి మధ్యా నలుగుతూ అతడికి దూరంగా వెళ్ళి ఉద్యోగంలో చేరింది కానీ అతడు తనకు దూరంగా వెళ్ళే సమయం ఆసన్నమయేటప్పటికి ఆమెలో మమకారం కట్టలు తెంచుకుంది — ఎందుకు? ఆమె ఎందుకు బాధపడాలి. ఆ బాధ ఏమనిపించుకుంటుంది? ప్రేమా! జాలా? పశ్చాత్తాపమా? ఆమె స్వభావమా?!

అతడు తిరిగి వస్తాడు.

ఆమె ఇప్పుడనుకుంటున్నట్లుగా ఇంక ఆమెలో ఎన్నడూ అసంతృప్తి ఉండదా? ఈ అనుభవాన్ని పురస్కరించుకుని ఆమెలో తృప్తి శాశ్వతంగా నెలకొంటుందా! లేక అతడు వచ్చాక ఆ సంతోషానికి, ఆ సుఖాలకు అలవాటు పడ్డాక తిరిగి ఆమెలో ఆ చాంచల్యం రేకెత్తుతూ ఉంటుందా మధ్యమధ్యన! ఇందిర సంగతి ఏమో కానీ...

మనసును నిగ్రహించని మానవ స్వభావం చంచలంగా ఉంటుంది. అశాంతిని రేకెత్తిస్తూంటుంది.

□□